క్లుప్తంగా

ఆరు పాఠశాలలకు ఫర్నీచర్ పంపిణీ



మాట్లాడుతున్న ఐడీబీఐ మేనేజర్ మృదుల

నంద్యాల(న్యూటౌన్): ఐడీబీఐ బ్యాంకు సౌజన్యంతో నంద్యాల పరిసర ప్రాంతాల్లోని ఆరు పాఠశాలలకు అవసరమైన ఫర్నీచర్, సామగ్రిని ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మృదుల, నవీన్, నర్సప్ప అందజేశారని ఎంఈఓలు బ్రహ్మం నాయక్, శివరాంప్రసాద్ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ బీరువాలు, టేబుళ్లు, స్కానర్లు, ప్రింటర్లు, కుర్చీలు అందించినట్లు చెప్పారు. శ్రీనివాసరావు, శ్రీలత, మహాలక్ష్మి, హైమావతి, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముత్యాలపాడులో 104 వైద్య శిబిరం



ముత్యాలపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్సీ పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో వైద్యాధికారి శివమోహన్ ఆధ్వర్యంలో బుధవారం సచివాలయం-1లో నిర్వహించిన 104 సంచార వైద్యశిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి నెలకు సరిపడ మందులను అందించారు. ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబాబరాయుడు, ఎంఎల్హెచ్పీలు పాల్గొన్నారు.

యోగా గురువుకు నివాళి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమరయోగ వికాస కేంద్రంలో బుధవారం అచల పరిపూర్ణా యోగా నంద పాములేటి స్వామి ద్వితీయ ఆరాధన వేడుకలను నిర్వహించారు. ముందుగా పాములేటి స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి నివాళులర్పించారు. యోగానంద స్వామి మాట్లాడుతూ పట్టణంలో మొదటి సారిగా యోగాను పరిచయం చేసిన వ్యక్తి పాములేటి స్వామి అని, పట్టణ పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేశారన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం, పాల్గొన్న రవాణా శాఖ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారిణి ఐశ్వర్యారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కాలేజీ, నేషనల్, వెంకటేశ్వర, రావూస్ తదితరల విద్యార్థులతో కలిసి టెక్కె మార్కెట్ యార్డు నుంచి పద్మావతి నగర్ ఆర్చ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రహదారి గురించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు.

పప్పు శనగలో పంట కోత ప్రయోగం



వెంగంపల్లెలో ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బీమా ప్రతినిధులు

ఉయ్యాలవాడ : ఈ ఏడాది రబీ సీజన్లో సాగు చేసిన పప్పు శనగలో పంట కోత ప్రయోగాలు బుధవారం చేపట్టారు. మండలంలోని వెంగంపల్లె గ్రామంలో రైతు నాగిరెడ్డి సాగు చేసిన 2.50 ఎకరాల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం బీమా కంపెనీ ప్రతినిధులతో కలిసి వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయని వారు వెల్లడించారు. ఈ ఏడాది శనగ పంటకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో పాటు తుపాన్ ప్రభావంతో అధిక వర్షాలకు భూమిలో తేమశాతం ఉండటంతో పంటకు వైరస్ తెగుళ్లు ఆశించాయని ఏఈఓ సునీత పేర్కొన్నారు. బీమా కంపెనీ ప్రతినిధులు మహేష్, స్వరూప్కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భవానీ పాల్గొన్నారు.

విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచ్యామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

క్రిష్టిపాడుకు చెందిన ఈ మహిళ పేరు రాణి. తన ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తుంది. పెద్ద కూతురు నిషి హరివరం ఉన్నత పాఠశాలలో 9 వతరగతి, రెండవ కూతురు అపర్ణ 8వ తరగతి, కుమారుడు పవన్ 4వ తరగతి క్రిష్టిపాడులోనే చదువుతున్నారు. అపర్ణ వచ్చే ఏడాది 9వ తరగతికి హరివరం వెళ్లాల్సింది. 'అమ్మాయిని రోజూ హరివరంలోని ఉన్నత పాఠశాలకు మూడున్నర కిలోమీటర్లు కాలినడకన పంపాలంటే ప్రస్తుత పరిస్థితులను చూస్తే భయమేస్తుంది..మా ఊర్లోని బడిని 10వ తరగతి వరకు చేస్తే బాగుంటుంది కదా' అని కోరుతోంది.



అప్గ్రేడ్ ఆందోళన!

- క్రిష్టిపాడు యూపీ స్కూల్ అప్గ్రేడ్కు సన్నాహాలు
- హరివరం జెడ్పీ హైస్కూల్లో విలీనం వద్దంటున్న గ్రామస్తులు
- సందిగ్ధంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు
- కంపమల్ల ఎంపీయూపీని విలీనం చేస్తే హైస్కూల్కు మార్గం సుగమం



క్రిష్టిపాడులోని ఎంపీయూపీ స్కూల్

దొర్నిపాడు: కూటమి సర్కారు తీసుకున్న నూతన విద్యావిధానంతో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల్లో అలజడి, తల్లదండ్రుల్లో ఆందోళన నెలకొంది. విద్యాలయాల విభజన వారిని ఇబ్బంది పెడుతోంది. గ్రామ పంచాయతీలో 60 పైగా విద్యార్థులు ఉన్న చోట మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతుల్లో 60 పైన విద్యార్థులు, మౌలిక వసతులు ఉంటే ఉన్నత పాఠశాలగా అప్గ్రేడ్ చేస్తామని, 60లోపు పిల్లలున్న ప్రాథమికోన్నత బడులను రద్దు చేసి సమీప ఉన్నత పాఠశాలలో కలుపుతామని పేర్కొంది. మండలంలో ఏకైక ఎంపీయూపీ స్కూల్ క్రిష్టిపాడులో ఉంది. 1-8వ తరగతి వరకు మొత్తం 120 మందికి పైగా విద్యార్థులున్న ఆ పాఠశాల మనుగడ ప్రస్తుతం ప్రమాదంలో పడింది. మా బడిని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దు.. కావాలంటే మా స్కూల్ను 10వ తరగతికి అప్గ్రేడ్ చేసేందుకు అవసరమైన వసతులన్నీ ఉన్నాయని క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాడు-నేడుతో సకల వసతులు..

గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ను రూ.21లక్షలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం నాడు-నేడు కోసం ఖర్చు చేసింది. సకల సౌకర్యాలతో సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. అప్గ్రేడ్కు సరిపడా తరగతి గదులు, బాలికలకు మరుగుదొడ్లు, మినరల్ వాటర్ ప్లాంటు, సభావేదిక, బెంచీలు, విద్యుత్ వసతి, ఫ్యాన్లు ఇలా..అన్ని వసతులును సమకూర్చారు.

కంపమల్ల యూపీ స్కూల్ను మ్యాపింగ్ చేస్తే..

కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల గ్రామంలోని ఎంపీయూపీస్కూల్ ప్రస్తుతం 7, 8 తరగతుల్లో విద్యార్థులు లేనప్పటికీ ప్రస్తుతం 5వ తరగతిలో 12 మంది, 6వ తరగతిలో 12 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 5వ తరగతి విద్యార్థులు 6వ తరగతికి ప్రమోట్ కావడం వల్ల మొత్తం 24 మంది విద్యార్థుల ను క్రిష్టిపాడులోని ఎంపీయూపీ స్కూల్లో మ్యాప్ చేస్తే సరిపోతుంది. అలాగే 6- 8 వరగతి విద్యార్థులు 57 మంది విద్యార్థులు క్రిష్టిపాడులో ఉన్నారు. అంతేగాక వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న 17 మంది విద్యార్థులు ప్రమోట్ కావ డం వల్ల 74 మంది అవుతారు. అలాగే కంపమల్ల నుంచి వచ్చే 24 మందిని కలిపితే మొత్తం 98 మంది విద్యార్థులు హైస్కూల్ సెక్షన్లో ఉంటారు. యూపీ స్కూల్ను 10వ తరగతికి అప్గ్రేడ్ చేయాలంటే నిబంధనల ప్రకారం 60 మంది విద్యార్థులుంటే సరిపోతుంది. ఉన్నతాధికారులు ఆ దిశగా అడుగులు వేస్తే సరిపోతుంది.

అప్గ్రేడ్ చేసేందుకు నివేదికలు పంపాం



క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్ను 10వ తరగతికి అప్గ్రేడ్ చేసేందుకు ఉన్నతాధికారులకు పంపించాం. ఫైనల్గా ఉన్నతాధికారులు మరోసారి సర్వే చేస్తారు. అప్పుడు తల్లిదండ్రుల, గ్రామస్తుల అభిప్రాయాలు ముఖ్యం. అంతేగాక విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు శ్రద్ధ చూపాలి. మా బాధ్యతగా పాఠశాలలను ఉంచేందుకు కృషి చేస్తున్నాం.

– మనోహర్రెడ్డి, ఎంఈఓ, దొర్నిపాడు

యూపీ స్కూల్ను రద్దు చేసి..

ప్రస్తుతం ప్రభుత్వం యూపీ స్కూళ్లను తొలగించి 6,7,8 తరగతుల విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూళ్లలో కలపాలని విద్యాశాఖ భావిస్తోంది. అంటే క్రిష్టిపాడుకు దగ్గరలో ఉయ్యాలవాడ మండలంలోని హరివరం ఉన్నత పాఠశాల ఉంది. కానీ గ్రామానికి 3.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో గ్రామంలోని యూపీ స్కూల్ను హరివరంలో విలీనం చేసేందుకు అవకాశం లేదు. క్రిష్టిపాడుకు కేవలం అర కిలోమీటరు దూరంలో ఉన్న కంపమల్ల యూపీ స్కూల్ విద్యార్థులను క్రిష్టిపాడులో మ్యాప్ చేస్తే అప్గ్రేడ్ మార్గం సుగమమం అవుతుంది.

విద్యార్థులకు ప్రయాణ కష్టాలు..

కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల యూపీ స్కూల్ విద్యార్థులు 8 తరగతి అయిన వెంటనే 9వ తరగతికి మండలంలోని భీమునిపాడు హైస్కూల్కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు రోజు 4.5 కి.మీ. దూరం వచ్చిపోయేందుకు ఏటా ప్రయాణ కష్టాలు పడుతున్నారు. అదే క్రిష్టిపాడులోని యూపీ స్కూల్కు మ్యాప్ చేస్తే హైస్కూల్గా మారడంతో పాటు అర కిలోమీటరు దూరంలో ఉంటుండటంతో బాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతగా ఉంటుంది. ఈ విద్యాసంవత్సరంలో 7, 8 తరగతి విద్యార్థులు ఒక్కరు కూడా లేక పోవడం గమనార్హం. క్రిష్టిపాడు స్కూల్కు మ్యాప్ చేస్తే దూరాభారం తగ్గి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని కంపమల్లంలోని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం అల్లూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రత్యేకంగా ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నారులకు కొత్త ఆధార్ నమోదు ఉచితంగా, మిగతా వారికి రూ.100 సర్వీస్ ఫీజుతో బయోమెట్రిక్ అప్డేట్ చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో గురువారం కూడా శిబిరం కొనసాగుతుందని చెప్పారు.

గుడిసె దగ్ధం

చాగలమర్రి: స్థానిక కొత్త ఎస్సీ కాలనీలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలనీకి చెందిన మద్దూరు అంకాలమ్మకు చెందిన గుడిసె కాలిపోయింది. దీంతో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదాన్ని గమనించిన కాలనీ వాసులు మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామాన్లు కాలిపోయాయి. కూలీ పని చేసుకోని జీవనం సాగిస్తున్న తనకు నిలువ నీడ లేకుండా పోయిందని, ప్రభుత్వం సహాయం చేయాలని బాధితురాలు కన్నీరు పెట్టుకుంది.

జయప్రదం చేయండి

ఆళ్లగడ్డ: స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఒప్పందాల రద్దుపై ఈ నెల 30వ తేదీ ఆళ్లగడ్డలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర జాతను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు రామచంద్రుడు బుధవారం కోరారు. గురువారం ఉదయం నంద్యాల నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర జాత సాయంత్రం నాలుగు గంటలకు ఆళ్లగడ్డ చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సంత మార్కెట్ ఆవరణలో కళారూపాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం చాగలమర్రి, ప్రొద్దుటూరు మీదుగా సాగుతుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే బ్రిడ్జి సైడ్వాల్ కూలిపోయింది



సైడ్వాల్ను పరిశీలిస్తున్న చైర్పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): బ్రిడ్జి సైడ్ వాల్ కూలిపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా అధికారులపై మండిపడ్డారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సలీం నగర్లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి సైడ్వాల్ కూలిన ప్రాంతాన్ని చైర్పర్సన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బ్రిడ్జి పక్కన డ్రైనేజీ కోసం మట్టిని తవ్వడంతో సైడ్వాల్ కూలిపోయిందని, ఇది అధికారుల వల్లే జరిగిందని స్థానికులు చెప్పారని ఆమె తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యేపై బురద చల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు నిజాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కౌన్సిలర్లు మేస చంద్రశేఖర్, తమీమ్, కలాం, హారీఫ్బాషా, వైఎస్సార్సీపీ నాయకులు బాషా, కారు రవికుమార్, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- స్కిల్ హబ్ కమిటీలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఉపాధి అవకాశాలు కల్పించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ నూతన పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం కింద బ్యాంకులకు సిఫారసు చేసిన అర్జీలను జాప్యం చేయకుండా నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సూచించారు.

స్కిల్ కమిటీలు లక్ష్యాలను సాధించాలి..

జిల్లాలో స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజ్ ట్రైనింగ్స్, జాబ్ మేళాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న పారిశ్రామిక యూనిట్లలో ఇచ్చిన శిక్షణల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్కిల్ హబ్ కమిటీలకు కేటాయించిన లక్ష్యాలపై దృష్టి సారించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్ బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, ఏపీఎస్ఎఫ్ఎస్ బ్రాంచ్ మేనేజర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పాల్గొన్నారు.

పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల(న్యూటౌన్): జీవో నెం.117ను రద్దు చేసి గతంలో ఉన్న పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతుల విలీనాన్ని రద్దు చేయమని కోరామని, పాఠశాలలను రద్దు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. 117 జీవోకు సవరణగా వచ్చిన మెమోకు భిన్నంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఒక్క గ్రామ పంచాయతీలో అబిస్టేషన్ల నుంచి బేసిక్ ప్రైమరీ పాఠశాలల విలీనం ద్వారా వేలాది ప్రాథమిక పాఠశాలలను అంగన్వాడీలతో కలిపి ఫౌండేషన్ స్థాయికి దిగజార్చే పరిస్థితి తీసుకురావద్దని ప్రభుత్వానికి సూచించారు. 3, 4, 5 తరగతులకు మోడల్ ప్రైమరీలు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. దీంతో బడుగు బలహీన వర్గాల పిల్లలకు పాఠశాలలు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో సర్పంచ్, తల్లిదండ్రులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, సభ్యులు వీరేశ్వరరెడ్డి, రంగనాయకులు, శ్రీరాములు, వీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న కాలనీ వాసులు

నంద్యాల(న్యూటౌన్): 40 ఏళ్లుగా పట్టణంలోని బర్మాశాలలో రిజిస్టర్ అయిన స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న తమకు కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని కాలనీవాసులు ప్రభాకర్రావు, బ్రహ్మయ్య, లక్ష్మి, శ్రీలత, వెంకటేశ్వర్లు, శీనులు కోరారు. బుధవారం పట్టణానికి చెందిన పలువురు బర్మాశాలలోని స్థలాలు తమవేనంటూ వాటికి సంబంధించి కొలతలు వేసేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానికులు కొలతలను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. వివాదం ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురిని అక్కడి నుంచి పంపించారు. బాధితులు మాట్లాడుతూ.. పలువురు ఆక్రమణదారులు తమపై దాడులకు దిగి స్థలాలు ఖాళీ చేయకపోతే అంతు చూస్తామంటూ హెచ్చరించారని వారు వాపోయారు. చివరకు ప్రొక్లెయిన్ ద్వారా తమ ఇళ్లను నేలమట్టం చేసేందుకు యత్నింస్తుండగా అడ్డుకున్న తమపై దాడులకు దిగేందుకు తెగబడ్డారని పోలీసుల రాకతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

కూరగాయల సరఫరాకు ముందుకొచ్చిన దాత

మహానంది: మహానంది నిత్యాన్న ప్రసాద పథకానికి కూరగాయలను ఉచితంగా అందించేందుకు హైదరాబాద్కు చెందిన మేకల జంగారెడ్డి ముందుకొచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దాత జంగారెడ్డి బుధవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈఓ మాట్లాడుతూ ఇప్పటికే రెండు నెలల నుంచి జంగారెడ్డి కూరగాయలు ఉచితంగా పంపుతున్నారన్నారు. ఇకపై శాశ్వతంగా కూరగాయలను పంపేందుకు అంగీకరించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ నుంచి కూరగాయలను మహానంది చేర్చేందుకు హైదరాబాద్కు చెందిన వారణాసి రామ్మోహన్రావు, నంద్యాలకు చెందిన బాలగంగాధర బస్సు సర్వీస్ వారు సహకరిస్తున్నట్లు వివరించారు. అనంతరం దాతకు స్వామి అమ్మవారి చిత్రపటం అందించి సన్మానించారు. కార్యక్రమంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలోని రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ ప్రమీళ

దొర్నిపాడు:అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణాల యాజమానులకు మండల వ్యవసాయాధికారి ప్రమీళ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఏర్పాటు చేసిన ధరల పట్టిక, స్టాకు రికార్డులను పరిశీలించారు.

పొలం పిలుస్తోంది..

మండల కేంద్రంతో పాటు కొండాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ ప్రమీల పాల్గొన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా మిశ్రమ పంటలను సాగుచేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం అడుగులు వేయాలని రైతులకు అవగాహన కల్పించారు.

కనీస వేతనమివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీని వెంటనే అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేసి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్(సీఐటీయూ) అధ్యక్షురాలు షేబారాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, ఎం.నిర్మలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్కు వేతనాలు పెంచుతామని చెప్పి..అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వమే విద్యుత్ బిల్లు, ఇంటి అద్దెలు, చెల్లించాలన్నారు. మంజుల, హరిత, నిర్మల, రమణమ్మ, సునితమ్మ, నాగరాణి పాల్గొన్నారు.

క్షణికావేశంలో ఘర్షణకు పాల్పడొద్దు

కొలిమిగుండ్ల: క్షణికావేశంలో ఎవరూ గొడవలకు పోవొద్దని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సూచించారు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్తో పాటు ఆవరణలో గతలంలో దాతల సహకారంతో నిర్మించిన షటిల్ కోర్టు, పార్కును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి భద్రతలపై పూర్తిగా దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుతం భూముల వివాదాలపైనే గొడవలు జరుగుతున్నా యని చెప్పారు. వివాదాలు వచ్చినపుడు ఇరువర్గాలు ఘర్షణలకు దిగకుండా సమస్యను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. లాంగ్ పెండింగ్లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సీఐ రమేష్బాబుకు సూచించారు.

లోక్ అదాలత్ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ను సమష్టిగా విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అదాలత్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్బౌన్స్, కుటుంబ తగాదాల వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని ఇరువర్గాలకు చెందిన న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శైలజ, ఈశ్వర వెంకటప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

భవనాల్లో సామగ్రి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



ధాన్యం బస్తాలను తొలగించిన దృశ్యం

అంగన్వాడీ నూతన భవనంలో ఉన్న ధాన్యం బస్తాలు(ఫైల్)

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అప్పట్లో పనులు చేపట్టి నిధులు ఉన్నంత వరకు నిర్మాణాలు సాగించారు. ఈ లోపు కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలను నిలిపేశారు. దీంతో అసంపూర్తిగా ఉన్న భవనాలను కొందరు ఆక్రమించకున్నారు. ఆక్రమణలపై ఇటీవల సాక్షి దినపత్రికలో నిధులు రాక..నిర్మాణం పూర్తికాక అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. శ్రీరంగాపురంలోని రెండు నూతన అంగన్వాడీ భవనాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం, పశు గ్రాసం,మంచాలు, దోమతెరలు వంటి వాటన్నిటిని తొలగించినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి తెలిపారు.

పెయ్య దూడల వృద్ధితో లాభాలు



మాట్లాడుతున్న డీడీ డి.వి రమణయ్య

చాగమర్రి: పాడి పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి 18 శాతం ఆదాయం వస్తుందని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.డి.వి రమణయ్య అన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ విజయ డెయిరీ లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు. పాడి రైతులకు పాల ఉత్పత్తి పెరిగి లాభాలు పెరగాలంటే పెయ్య దూడల సంతతి అభివృద్ధి అవసరమని, అందుకే ప్రభుత్వం పెయ్య దూడల అభివృద్ధికి బర్రెల్లో కృత్రిమ గర్భధారణకు కృషి చేస్తుందని చెప్పారు. రోజుకు 20 లీటర్ల పాలిచ్చే ముర్రా జాతి పెయ్యదూడలు 90 శాతం జన్మించేటట్లు వాటి వీర్యకణాలను ఇంజెక్షన్ ద్వారా ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు.బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముర్ర జాతి పెయ్య దూడల ఉత్పత్తికి ప్రభుత్వం కృత్రిమ గర్భాధారణకు ఒక్కో ఇంజెక్షన్ రూ.800కు అందజేస్తుందని ఇందుకు రూ.300 సబ్సిడీ పోనూ పాడి రైతులు రూ.500 చెల్లించాలన్నారు. అంతే కాకుండా ఆళ్లగడ్డ డివిజన్లోని 12 మండలాల్లో పాడి రైతులు తమ పొలాల్లో పశుగ్రాసం పెంపకానికి 432 ఎకరాల విస్తీర్ణం కేటాయించారన్నారు. అందులో ఇప్పటి వరకు 115 ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగుకు భూములను గుర్తించి, రైతుల పేర్లతో ప్రతిపాదనలు పంపగా వాటికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఒక్కో రైతుకు అర ఎకరా విస్తీర్ణంలో పశుగ్రాసం సాగుకు రూ.33 వేలు ఒక ఏడాదికి ఏన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేస్తారని పేర్కొన్నారు. చాగలమర్రి మండలానికి 24 ఉకరాలకు నిధులు మంజూరు చేశారన్నారు. డివిజన్లో 380 గోకులాలు ప్రభుత్వం మంజూరు చేయగా 800 దరఖాస్తులు అందాయని వాటిలో 315 మంది అర్హులైన వారికి గోకులాలను మంజూరు చేసి నిర్మాణానికి నిధులు కూడా విడుదల చేశామని, వాటిలో 153 గోకులాలు పూర్తి కాగా, ఇంకా 162 వివిధ దశల్లో నిర్మాణం సాగుతున్నాయని వివరించారు. ఒక్కో గోకులం యూనిట్ ధర రూ.2.20 లక్షలు కాగా వాటిలో రూ.20 వేలు లబ్ధిదారుని వాటాగా చెల్లించవలసి ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్లో చేపట్టిన పశుగణన 98 శాతం పూర్తయ్యిందని, ఫిబ్రవరి నెలలోపు మొత్తం పూర్తి చేస్తామన్నారు. డివిజన్లో 180 పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించవలసి ఉండగా ఇప్పటి వరకు 120 పూర్తి అయ్యాయని చెప్పారు. స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలో బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్యారోగ్య శిబిరంలో 1,300 పశువులకు జీవాలకు నట్టల నివారణ మందులు త్రాపించనట్లు ఏడీ వరప్రసాద్ తెలిపారు. జేవీఓ కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.